# పాదయాత్రను విజయవంతం చేద్దాం

- రైతు వ్యతిరేక విధానాలను ఎండగడుదాం
- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల


కోరుట్ల, నవంబర్ 5: రైతులకిచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ధ్వజమెత్తారు. ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను ఎండగడుదామని, ఈ నెల 12న రైతులతో కలిసి కోరుట్ల నుంచి జగిత్యాల కలెక్టరేట్ వరకు చేపట్టే పాదయాత్రను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. మంగళవారం కోరుట్ల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాదయాత్ర విజయవంతంపై బీఆర్ఎస్ నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ విజయవంతంగా అమలు చేసిన అన్ని రైతు సంక్షేమ పథకాలను ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి వెనక్కి తీసుకుంటున్నారని మండిపడ్డారు. ఆగస్ట్ 15లోగా రైతులందరికీ రుణమాఫీ చేస్తానని చెప్పి కేవలం 40శాతమే మాఫీ చేశారని దుయ్యబట్టారు. రైతుబంధు, రైతు భరోసా పథకాలను అమలు చేయడంలో విఫలమయ్యారని, రైతులు పండించిన వడ్లకు ₹500 బోనస్ ఇస్తామని మోసం చేశారని విమర్శించారు. ఈ నెల 12న చేపట్టే పాదయాత్రలో రైతులు, యువకులు, మేధావులు కలిసికట్టుగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో రైతు బంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చీటి వెంకట్రావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, మాజీ ఎంపీపీ తోట నారాయణ, పట్టణ మైనార్టీ అధ్యక్షుడు ఫహీం, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల



# సర్వేపై సవాలక్ష సందేహాలు?




- ఆస్తుల లెక్కల ఆరాపై అనేక అనుమానాలు
- సంక్షేమ పథకాలకు కత్తెర పెట్టేందుకేననే డౌట్లు
- ఆదాయ పన్ను చెల్లింపు అంశంపై అనేక సంశయాలు
- వ్యాపారుల వార్షిక టర్నోవర్‌పై ప్రశ్నలు
- ఐచ్ఛికం అంటూనే ఆధార్ కార్డు వివరాల సేకరణ
- తెల్లరేషన్ కార్డుకు కోతలు పడే ముప్పు
- చెప్పాలా..? వద్దా..? అన్న మీమాంసలో ప్రజలు

**తెలంగాణ ప్రభుత్వం నేటి నుంచి ప్రారంభిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై సవాలక్ష సందేహాలు తలెత్తుతున్నాయి. 56 ప్రశ్నలు, 75 అంశాలతో సేకరించనున్న సమాచారంలో వ్యక్తిగత సమాచారానికి సంబంధించినవే ఎక్కువగా ఉండడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సర్వే సమయంలో అన్ని వివరాలు ఇవ్వాలా..? లేదా..? అన్న సంశయం ప్రజల్లో కనిపిస్తున్నది. సర్వేలోని అంశాలను నిశితంగా పరిశీలిస్తే.. ఈ వివరాల ఆధారంగా సంక్షేమ పథకాలకు ప్రభుత్వం వాత పెడుతున్నదన్న డౌట్లు వివిధ వర్గాల నుంచి ఉత్పన్నమవుతున్నాయి. అందుకే ప్రభుత్వం కులగణనకు పరిమితం కాకుండా.. సర్వే పేరిట అనేక వివరాలు సేకరిస్తున్నదన్న అభిప్రాయాలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రధానంగా స్థిర చరాస్తులు, ఆదాయ పన్నుల వివరాల వంటివి అనేక అనుమానాలకు తావిస్తున్నాయి.**

కరీంనగర్, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/కమాన్‌పూర్ : సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) నేటి నుంచి ప్రారంభం కానున్నది. నెల రోజుల్లోనే పూర్తి చేసే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. అయితే ఈ ప్రక్రియలో అడిగే ప్రశ్నలు, తీసుకునే సమాచారంపై ప్రజల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 56 ప్రశ్నలు.. 75 అంశాలకు సంబంధించి సమాచారం సేకరించడానికి సర్వే ఫార్మాట్‌ను ప్రభుత్వం రూపొందించగా.. అందులో అనేక అంశాలు కుటుంబ వ్యక్తిగత వివరాలకు సంబంధించినవేనని పరిశీలకులు పేర్కొంటున్నారు. మచ్చుకు కొన్ని అంశాలను పరిశీలిస్తే.. సర్వే ఫార్మాట్ కాలం నంబర్ 20లో మీరు ప్రస్తుతం ఏమి పని చేస్తున్నారు? అనే ప్రశ్న అడిగారు. దీనికి అనుసంధానంగా చూస్తే.. కాలం నంబర్ 23లో వ్యాపారం, రియల్ ఎస్టేట్, పారిశ్రామిక వేత్త, అయితే వారి వార్షిక టర్నోవర్ వివరాలు నమోదు చేయాలని సూచించారు. అలాగే కాలం నంబర్ 29లో మీరు ఆదాయ పన్ను చెల్లిస్తున్నారా..? అని అడిగారు. ఇక్కడ ప్రజల్లో సందేహాలు తలెత్తుతున్నాయి. ఒకవేళ ఆదాయ పన్ను చెల్లిస్తున్నామని చెబితే.. సంక్షేమ పథకాలు వర్తిస్తాయా..? లేదా అన్న అనుమానాలు ఉత్పన్నమవుతున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా ఇచ్చేందుకు, అలాగే రైతు రుణమాఫీ చేసేందుకు ఈ తరహా అనేక నిబంధనలు పెట్టింది. అంతేకాదు, ట్యాక్స్ కట్టే వారికి సంక్షేమ పథకాలు కట్ చేయాలన్న వాదనను ప్రభుత్వ వాదులు తెరపైకి తెస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏమి చెప్పాలన్న అంశంపై ప్రజల్లో సంశయం నెలకొన్నది. ఇదే సమయంలో కాలం 30లో మీకు బ్యాంకు ఖాతా ఉందా..? లేదా? అనే ప్రశ్న ఉంది. కులవృత్తి దారులకు కూడా వార్షిక ఆదాయ వివరాలు సేకరించే విధంగా సర్వే ఫార్మాట్ ఉన్నది. అలాగే కాలం 31 నుంచి 40 వరకు భూముల వివరాలు సేకరించనున్నారు. అందులో ధరణి పాస్‌పుస్తకాలతో సహా తరి పట్టా, పడావు భూముల వంటి పూర్తి వివరాలు అడిగారు. రైతు భరోసాను ఐదెకరాల వరకు మాత్రమే వర్తింప చేస్తామని ప్రభుత్వం చెబుతున్నది. ఈ నేపథ్యంలో ఈ వివరాల ఆధారంగా కోతలు పెడుతారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాదు, ఎకరాల ఆధారంగా సంక్షేమ పథకాలకు కత్తెర వేయొచ్చనే వాదనలు వినిపిస్తున్నాయి. అలాగే పార్టు-2లో ఇంటి యజమానులు స్థిర, చరాస్తుల వివరాలు అడుగుతున్నారు. నివాస గృహ విస్తీర్ణం నుంచి మొదలు ఇంటిలో గదుల సంఖ్య వరకు వివరాలు ఇచ్చే బాధ్యతలను ఎన్యుమరేటర్లకు అప్పగించారు.

### తెల్లరేషన్ కార్డులుండేనా..?

ఈ సర్వేలో సేకరిస్తున్న సమాచారాన్ని బట్టి చూస్తే.. వేలాది మంది తెల్లరేషన్ కార్డులుంటాయా..? ఊడుతాయా..? అన్న సందేహాలు సైతం వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ఆరోగ్య శ్రీ పథకాన్ని రేషన్‌కార్డుతో ముడిపెట్టకుండా ఆరోగ్య శ్రీ కింద డిజిటల్ కార్డులు ఇస్తామని ప్రభుత్వం చెబుతున్నది. ఈ నేపథ్యంలో కుటుంబ యజమాని స్థిర, చర ఆస్తుల వివరాలు ఇస్తే కార్డులు ఊడే ప్రమాదం లేకపోలేదన్న అనుమానాలు వస్తున్నాయి. నిజానికి ఆస్తులు మాత్రమే కాదు, అప్పుల వివరాలు కూడా సేకరిస్తున్నట్టు నమ్మించడానికి ప్రభుత్వం ఫార్మాట్‌లో ఒక అంశాన్ని చేర్చింది. అయితే రాష్ట్రంలో నూటికి 90 శాతం కుటుంబాలకు ఏదో రూపంలో అప్పు ఉంటుంది. అది ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద కావచ్చు, లేదా బ్యాంకుల్లో కావచ్చు. పోనీ అప్పుల వివరాలు చెబితే ప్రభుత్వం ఏమైనా తీరుస్తుందా..? అంటే అటువంటి విషయం చరిత్రలో జరగలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఏ పరిస్థితుల్లోనూ తీర్చదు. అంటే అప్పు మాటున ఆస్తుల వివరాలు సేకరించడమే లక్ష్యంగా సర్వే చేస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాదు, ఇళ్లు, ఇంటి విస్తీర్ణం, ఇంట్లో వాడుతున్న గదులు, తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని, ఇంటి కరెంటు బిల్లు మాఫీకి కూడా కోతలు పెట్టవచ్చన్న అనుమానాలున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం సైతం సమగ్ర కుటుంబ సర్వేను ఒకే రోజు నిర్వహించిన విషయం తెలిసిందే. ఆ సర్వే ఆధారంగా మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను విస్తరించిందే తప్ప.. ఎటువంటి కోతలు పెట్టలేదు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం రోజుకో మాట మాట్లాడడం, ఆచరణలో అనేక పథకాల అమలుకు కొర్రీలు వేయడం, దీంతోపాటు రైతు రుణమాఫీ, రైతు భరోసా వంటి అంశాలపై ఎటువంటి స్పష్టత లేకుండా సాగదీయడం, అలాగే ఆరు గ్యారెంటీల అమలులో తిరకాసులు వంటి అంశాలను అధ్యయనం చేసి చూస్తే.. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఉండడంతో పాటు ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలకు వాత పెట్టడమే లక్ష్యంగా ఈ సర్వేలోని పలు అంశాలున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు సంపూర్ణ వివరాలు ఇస్తారా..? లేదా..? అన్న ఉత్కంఠ నెలకొనగా, సర్వేకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించడంలోనూ ప్రభుత్వం వెనుకబడిందన్న విమర్శలు వస్తున్నాయి.

# నేటి నుంచే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే

- 6,7,8 తేదీల్లో హౌస్ లిస్టింగ్
- 9 నుంచి ప్రారంభం కానున్న కుటుంబ సర్వే
- ఒక్కో ఎన్యుమరేటర్‌కు 150 ఇండ్ల కేటాయింపు
- ప్రతిరోజూ పది ఇండ్ల సర్వే పూర్తికి కసరత్తు



**కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) నేటి నుంచి ప్రారంభం కానున్నది. ఈ సర్వేను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ప్రభుత్వం ఇప్పటికే కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయగా, ఆ మేరకు ఆయా జిల్లాల్లో అంతా సిద్ధమైంది. ముందుగా ఈ నెల 6,7,8 తేదీల్లో ఎన్యుమరేషన్ బ్లాక్ (ఈబీ)ల వారీగా హౌస్ లిస్టింగ్ చేస్తారు. ఆ మేరకు విధివిధానాలను ఇప్పటికే ఎన్యుమరేటర్లకు వివరించిన అధికారులు, అందుకు సంబంధించిన సామగ్రిని అందించడంతోపాటు శిక్షణ తరగతులు నిర్వహించారు.**

కరీంనగర్, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ల అమలు కోసం ముందుగా కులగణన సర్వే చేయాలన్న అంశంపై చర్చ జరిగింది. అందుకోసం ఒక కమిషన్ ఏర్పాటు చేసి, దాని ఆధ్వర్యంలో కులగణన సర్వే చేసి, తద్వారా రిజర్వేషన్లు అమలు చేయాలనే డిమాండ్ బీసీ సంఘాల నుంచి వ్యక్తమైంది. ఆ మేరకు ముందుగా కులగణనకు ఓకే చెప్పిన ప్రభుత్వం, ఆ తర్వాత తన నిర్ణయాన్ని మార్చుకున్నది. కుటుంబానికి సంబంధించి ఆస్తిపాస్తుల వివరాలే కాకుండా, సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ పరిస్థితులతోపాటు తదితర వివరాలు తెలుసుకోవాలన్న లక్ష్యంతో ఇంటింటి సర్వేకు శ్రీకారం చుట్టింది. కులగణనే ప్రధాన ఇతివృత్తంగా సాగాల్సిన సర్వేలో ప్రస్తుతం అదో అంశంగా మాత్రమే ఉన్నది. ఆ లెక్కల ఆధారంగా అనేక అంశాలు బయటకు వస్తాయని ప్రభుత్వం భావిస్తున్నది.

### 10.84 లక్షల గృహాలు

2011 జనాభా లెక్కల ఆధారంగా గుర్తించిన నివాసాల సంఖ్య ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 10,84,537గా నమోదై ఉన్నాయి. అందులో గ్రామీణ ప్రాంతంలో 7,08,363, పట్టణ ప్రాంతంలో 3,76,174 నివాసాలున్నాయి. వీటి గణన కోసం ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 7,338 ఎన్యుమరేషన్ బ్లాక్‌లను ఏర్పాటు చేశారు. వీటి ఆధారంగా కుటుంబ సర్వే చేసేందుకు 7,480 మంది ఎన్యుమరేటర్లను గుర్తించారు. అయితే హౌస్ లిస్టింగ్ సర్వే పూర్తయితే ఎన్యుమరేటర్ల సంఖ్య పెరిగే అవకాశాలున్నాయి. ఆయా జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో జరిగే ఈ సర్వేకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు అధికారులు చెబుతున్నారు.

### 56 ప్రశ్నలు.. 75 అంశాలు


సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా ప్రభుత్వం ఒక కుటుంబ యజమాని నుంచి 75 అంశాలకు సంబంధించి వివరాలు సేకరించేందుకు ఫార్మాట్‌ను తయారు చేసింది. నిజానికి 56 ప్రశ్నలే కనిపిస్తున్నా, అందులో ఉప అంశాలు కలిపి చూస్తే 75 విషయాలపై కుటుంబ యజమాని సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. ముందుగా ప్రభుత్వం చెప్పిన దాని ప్రకారం చూస్తే, ఈ నెల 6 నుంచే ఇంటింటి సర్వే ప్రారంభం కావాలి. కానీ, ఈ నెల 1నుంచి 5వరకు చేయాల్సిన హౌస్‌లిస్టింగ్ సర్వే మధ్యలోనే ఆగిపోయింది. దీంతో తిరిగి ఈ నెల 6,7,8 తేదీల్లో హౌస్‌లిస్టింగ్ సర్వే చేసిన తర్వాత కుటుంబ సర్వే చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం 2011 జనాభా లెక్కల ఆధారంగా సేకరించిన నివాసాల సంఖ్యను పరిగణనలోకి తీసుకొని, ఎన్యుమరేషన్ బ్లాక్‌ల జాబితా తయారు చేశారు. అయితే గడిచిన 14 ఏళ్లలో భారీగా గృహాలు పెరుగగా, ముందుగా వీటిని గుర్తించేందుకు హౌస్ లిస్టింగ్‌ను చేపడుతున్నారు. 2011 జనాభా లెక్కల కోసం అనుసరించిన ఒక్కో ఎన్యుమరేషన్ బ్లాక్‌లో కొత్తగా నిర్మాణమైన ఇండ్లను గుర్తించి, ఇంకా ఎన్యుమరేటర్ల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉందా..? లేదా అనేది ముందుగా నిర్ధారిస్తారు. అంతేకాదు, హౌస్ లిస్టింగ్ పూర్తయితేనే ఒక ఎన్యుమరేషన్ బ్లాక్‌లో ఎన్ని ఇండ్లు ఉన్నాయన్నది కచ్చితంగా తెలుస్తుంది. ఆ సంఖ్యను బట్టి సిబ్బందిని పెంచడం లేదా తగ్గించడం, బ్లాక్‌లను పెంచడం వంటివి చేస్తారు.

**జిల్లాల వారీగా ఉన్న పట్టణ, గ్రామీణ ఇండ్ల సంఖ్య, ఆయా జిల్లాల్లో ఏర్పాటు చేసిన ఎన్యుమరేషన్ బ్లాక్‌లు, ఎన్యుమరేటర్ల నియామక వివరాలు**

| జిల్లా | గ్రామీణ నివాసాల సంఖ్య | పట్టణ నివాసాల సంఖ్య | మొత్తం నివాసాలు | బ్లాక్‌ల ఏర్పాటు | సిబ్బంది నియామకం |
|---|---|---|---|---|---|
| జగిత్యాల | 2,36,432 | 80,188 | 3,16,620 | 2,110 | 2,110 |
| కరీంనగర్ | 1,74,230 | 1,56,169 | 3,30,399 | 1,958 | 2,000 |
| పెద్దపల్లి | 1,57,701 | 89,817 | 2,47,518 | 1,800 | 1,900 |
| రాజన్నసిరిసిల్ల | 1,40,000 | 50,000 | 1,90,000 | 1,470 | 1,470 |
| మొత్తం | 7,08,363 | 3,76,174 | 10,84,537 | 7,338 | 7480 |

# రోడ్డెక్కిన రైతన్న

- ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై ఆగ్రహం
- మధురానగర్ చౌరస్తాలో ధర్నా, రాస్తారోకో
- మాజీ ఎమ్మెల్యే సుంకెతో కలిసి ఆందోళన
- వెంటనే కొనుగోలు చేపట్టాలని డిమాండ్



మధురానగర్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ నాయకులు, రైతులు

గంగాధర, నవంబర్ 5: కాంగ్రెస్ సర్కారుపై రైతులు కన్నెర్ర జేస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యంపై కడుపుమండి రణానికి దిగుతున్నారు. కేంద్రాలకు వడ్లు తెచ్చి రోజులు గడుస్తున్నా కాంటా పెట్టిన పాపాన పోకపోవడంతో రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నారు. మంగళవారం గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో కరీంనగర్ జగిత్యాల జాతీయ రహదారిపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నాయకులు, రైతులు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో కలిసి ధర్నా, రాస్తారోకో చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. కాగా, ధర్నా చేస్తున్న నాయకులను పోలీసులు అరెస్టు చేసి గంగాధర ఠాణాకు తరలించగా, ఇదేం పద్ధతి అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడారు. కాంగ్రెస్ సర్కారు రైతులను అరిగోస పెడుతున్నదని, కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి 20 రోజులు గడుస్తున్నా ఒక్క గింజ కొనకుండా వేధిస్తున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తానన్న రుణమాఫీకి రూపులేకుండా పోయిందని, రైతు భరోసా జాడ లేదన్నారు. ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనేవారే లేరన్నారు. ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. మద్దతు ధరతో ధాన్యం కొనే దాకా బీఆర్ఎస్ రైతులకు అండగా ఉంటుందని భరోసానిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మేచినేని నవీన్‌రావు, సాగి మహిపాల్‌రావు, ఐలినేని సాగర్‌రావు, చిలుక రవీందర్, వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, ఆకుల మధుసూదన్, జనగం శ్రీనివాస్, కంకణాల విజేందర్‌రెడ్డి, మడ్లపెల్లి గంగాధర్, వేము దామోదర్, దూలం శంకర్‌గౌడ్, వేముల అంజి, బందారపు అజేయ్, నజీర్, చొప్పదండి నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



### వడ్లు కొంటలేరు

కాంగ్రెస్ సర్కారు వచ్చినంక రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానంటే నిజమని నమ్మి ఓట్లేసినం. ఆగస్టు 15లోపల మాఫీ చేస్తామంటే సంబురపడ్డం. కానీ నేను తీసుకున్న రూ.2 లక్షల లోన్ మాఫీ కాలేదు. ఆఫీసులు, సార్ల చుట్టూ తిరిగినా ఎందుకు మాఫీ కాలేదో చెప్పుతలేరు. ఇగ అత్తయి అగ అత్తయని అంటుర్రు. రుణమాఫీ చెయ్యలేదు, రైతు భరోసా రాలేదు, వడ్లు కొంటలేరు. ఇన్ని రకాలుగా మా రైతులను ఇబ్బంది పెట్టి ఏం సాధిస్తరో తెలుస్తలేదు.

- బట్టు మల్లయ్య, రైతు



### కేసీఆర్ సారే మంచిగుండే

కేసీఆర్ సారు ఉన్నప్పుడే మంచిగుండేది. దుక్కులు దున్నేటప్పుడే రైతు బంధు వేసిండు. సాగుకు పుష్కలంగా నీళ్లు అత్తుండే. కేంద్రాలను చాల్‌జేసి జెప్పన వడ్లు కొనేటోళ్లు. ఏ కష్టం లేకుండా అమ్ముకునేటోళ్లం. కాంగ్రెస్ సర్కారు వచ్చినంక మొత్తం తిర్రమర్ర అయ్యింది. రైతులను ముంచుడే తప్ప మంచి చేసేటోళ్లు లేకుండా పోయిన్రు. ఇప్పటికైనా వడ్లు కొనాలే.

- ద్యాగల ముత్తయ్య, రైతు

## సింగరేణిలో కొత్త దందా!

- గుడి పేరిట గుర్తింపు సంఘం చందా వసూల్?
- కార్మికుల అనుమతి లేకుండానే అక్టోబర్ నెల జీతంలోంచి ₹500 చొప్పున రికవరీ
- టెంపుల్ రికవరీ కోడ్స్ కింద కోత
- మండిపడుతున్న కార్మిక సంఘాలు
- ఇప్పటికీ వివరణ ఇవ్వని యాజమాన్యం
- సాంకేతికలోపం అంటున్న ఏఐటీయూసీ

**సింగరేణిలో కొత్త దందా మొదలైంది. కార్మికుల అనుమతి లేకుండానే జీతాల్లో కోత పడుతున్నది. కార్మికుల సమ్మతి మేరకు చందా తీసుకునే గుర్తింపు సంఘం, ఇప్పుడు ఏకంగా గుడిపేరిట ఉన్న టెంపుల్ రికవరీ కోడ్స్ ద్వారా నేరుగా వేతనాల్లోంచే వసూళ్లకు దిగింది. అక్టోబర్ నెల వేతనం నుంచి ₹500 చొప్పున రికవరీ చేయడంపై ఆగ్రహం వ్యక్తమవుతున్నది. దీనిపై సింగరేణి ఏమాత్రం స్పష్టత, వివరణ ఇవ్వకపోగా, గుర్తింపు సంఘమైన ఏఐటీయూసీ మాత్రం తమకు దీపావళి బోనస్ నుంచి ఇవ్వాల్సిన చందాలే సాంకేతిక కారణాలతో టెంపుల్ రికవరీ కోడ్ నుంచి కట్ అయ్యాయని పేర్కొనడంతో కార్మికులు మండిపడుతున్నారు. యాజమాన్యం, గుర్తింపు సంఘం కుమ్మక్కై నేరుగా దోపిడీకి దిగాయని ఆరోపిస్తున్నారు.**

గోదావరిఖని, నవంబర్ 5: సింగరేణిలో గుర్తింపు సంఘం దీపావళి పండుగ సందర్భంగా కార్మికులకు చెల్లించే బోనస్ నుంచి కార్మికుల అనుమతి మేరకు చందా వసూలు చేసుకునే అవకాశం ఉంది. కానీ, అందుకు విరుద్ధంగా గుడి పేరిట ఉన్న టెంపుల్ రికవరీ కోడ్స్ 1835,1840,1855 ద్వారా కార్మికుల అనుమతి లేకుండానే అక్టోబర్ వేతనంలో నుంచి ₹500 చొప్పున యాజమాన్యం రికవరీ చేయడం దుమారం రేపుతున్నది. దీనికి సంబంధించి సింగరేణి యాజమాన్యం నుంచి ఎలాంటి సమాధానం రావడం లేదు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ మాత్రం తమకు దీపావళి బోనస్‌లో నుంచి ఇచ్చే చందాలే సాంకేతిక కారాణాలతో గుడి కమిటీ నుంచి రికవరీ జరిగిందని, కార్మికులు ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలని పేర్కొంటుంది. గుడి కమిటీ కోడ్ నుంచి రికవరీ చేసిన డబ్బులను గుర్తింపు కార్మిక సంఘానికి దక్కేందుకే యాజమాన్యం ఇలా చేసిందని కార్మికులు ఆరోపిస్తున్నారు. కాగా, సింగరేణిలో గతంలో ఎప్పుడూ లేని విధంగా గుడి కమిటీ పేరుతో గుర్తింపు సంఘం చందా వసూలు చేయడంపై కార్మికులు తీవ్రంగా మండిపడుతున్నారు. దీనిపై పలు సంఘాల నాయకులు సింగరేణి ఉన్నతాధికారులను వివరాలు అడిగితే తమకేమీ తెలియదని చెబుతుండడం విస్మయం గొలుపుతున్నది.

### ఎలా వసూలు చేస్తరు

గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ కార్మికుల అనుమతి లేకుండా టెంపుల్ రికవరీ కోడ్స్ ద్వారా చందా ఎలా వసూలు చేస్తుంది. న్యాయంగా కార్మికుల అనుమతితో తీసుకోవాలి. కానీ, ఇలా చేయడం ఏమిటి? ఈ విషయమై సింగరేణి సీఎండీ, డైరెక్టర్ పాను వివరణ అడిగితే తమకేమీ తెలియదని అంటున్నరు. సింగరేణిలో అత్యుత్తమ స్థానంలో ఉన్న వారికి తెలియకుండా ఏ విధంగా ఎలా రికవరీ చేస్తరు? ఈ విషయంలో పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. అక్రమంగా వసూలు చేసిన డబ్బులను తిరిగి ఇచ్చేయాలి.

- జనక్‌ప్రసాద్, ప్రాతినిధ్య సంఘం ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్

### కార్మికులు తిప్పికొట్టాలి

ఏఐటీయూసీ గుడి పేరిట రాజకీయం చేస్తున్నది. కార్మికుల అనుమతి లేకుండా వేతనంలో నుంచి రూ.500 చొప్పున రికవరీ చేయడం అన్యాయం. రికవరీ చేసిన డబ్బులను ఆ కమిటీ ఖాతాలోకి వెళ్తాయి. ఆ డబ్బులను ఏఐటీయూసీకి చెల్లిస్తే క్రిమినల్‌కేసులు పెట్టాలని డిమాండ్ చేస్తాం. యూనియన్లకు చెల్లించే చందా డబ్బులను కార్మికుల బ్యాంకుల్లో నిల్వ ఉన్న డబ్బుల్లోంచి చెల్లిస్తారు. కానీ, అందుకు భిన్నంగా వేతనాల్లోంచి గుడి కమిటీ పేరిట కట్ చేయడం సరికాదు. వాటిని తమ ఖాతాలో వేసుకోవడానికి ఎర్ర జెండా యూనియన్ చేసిన పన్నాగాన్ని కార్మికులు తిప్పికొట్టాలి.

- మిర్యాల రాజిరెడ్డి, టీబీజీకేఎస్ అధ్యక్షుడు

### ఆందోళన తప్పదు

అనుమతి లేకుండా రికవరీ చేసిన డబ్బులను వెంటనే కార్మికులకు తిరిగి చెల్లించాలి. లేకుంటే ఆందోళనలు తప్పవు. సింగరేణిలో ఎప్పుడూ లేనివిధంగా కార్మికుల జీతాల్లో నుంచి యాజమాన్యమే రికవరీ చేయడం, దానిపై వివరణ ఇవ్వకపోవడం సరికాదు. గుడి కమిటీల పేరిట ఏవిధంగా రికవరీ చేసిందో సమాధానం చెప్పాలి. ఏఐటీయూసీ చేస్తున్న మోసాన్ని కార్మికులు గ్రహించాలి. ఈ విషయంలో తక్షణమే సింగరేణి సంస్థ సీఎండీ స్పందించి వాస్తవాలు తెలుపాలి.

- రియాజ్ అహ్మద్, హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి

## అరుణాచల క్షేత్రానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

తెలంగాణచౌక్, నవంబర్ 5: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని తమిళనాడులోని అరుణాచల శైవ క్షేత్రానికి వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నది. కరీంనగర్ రీజియన్ పరిధిలోని గోదావరిఖని, హుజూరాబాద్, కరీంనగర్ వన్ డిపో, జగిత్యాల, వేములవాడ డిపోల నుంచి సూపర్ లగ్జరీ బస్సులు సేవలందించనున్నాయి. ఈ నెల 13న ఆయా బస్టాండ్‌ల నుంచి బస్సులు బయలుదేరుతాయి. భక్తుల సౌకర్యార్థం మార్గం మధ్యలో కాణిపాకం, వెల్లూర్ గోల్డెన్ టెంపుల్స్ వద్ద ఆగుతాయి. 16న ఉదయం అరుణాచలం చేరుకుంటాయి. స్వామివారి దర్శనం అనంతరం సాయంత్రం తిరుగుపయనం మొదలవుతుంది. మార్గంమధ్యలో ఆలంపూర్ జోగులాంబ ఆలయం వద్ద ఆగి, దర్శనం అనంతరం ఆయా డిపోలకు చేరుకుంటాయి. ప్రత్యేక బస్సుల్లో గోదావరిఖని నుంచి వెళ్లే పెద్దలకు చార్జీ ₹4,850, పిల్లలకు ₹4వేలు, హుజూరాబాద్ నుంచి వెళ్లే పెద్దలకు ₹4,500, పిల్లలకు ₹3,800, కరీంనగర్ నుంచి వెళ్లే పెద్దలకు ₹4,500, పిల్లలకు ₹3,800, జగిత్యాల నుంచి వెళ్లే పెద్దలకు ₹4,700, పిల్లలకు ₹3,900, వేములవాడ నుంచి వెళ్లే పెద్దలకు ₹4,500, పిల్లలకు ₹3వేలు చెల్లించాల్సి ఉంటుంది. కాగా, అన్ని సర్వీసులకు ఆన్‌లైన్‌లో ముందస్తు టికెట్ బుకింగ్ చేసుకునే వెసులుబాటు ఉందని, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్ఎం సుచరిత సూచించారు.